క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలు తొలగించండి



వినతిపత్రం ఇస్తున్న చల్‌గల్ గ్రామస్తులు

జగిత్యాలరూరల్: ఉమ్మడి ఆస్తిలో గ్రామానికి చెందిన భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని చల్‌గల్ గ్రామస్తులు మంగళవారం రూరల్ తహసీల్దార్ రాంమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గడి వద్ద ఉమ్మడి ఆస్తిగా ఉన్న భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారులకు అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశాలు జారీ చేసినా అక్రమ నిర్మాణాలు తొలగించడం లేదని గ్రామ ప్రత్యేకాధికారి తహసీల్దార్‌గారు వెంటనే అక్రమ నిర్మాణాలు తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పట్టణ ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్య గుట్టపై గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, వైద్యాధికారి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి స్క్రీనింగ్ నిర్వహించి తగు జాగ్రత్తలు సూచించారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, సర్వేకల్ క్యాన్సర్‌లకు సంబంధించిన స్క్రీనింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గంగ జమున, మజీద్, శ్రావణి, శారద, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చాలని వినతి



కార్యదర్శికి విన్నవిస్తున్న బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో పాత గ్రామపంచాయతీ భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని వేరే చోటుకి మార్చాలని మంగళవారం బీజేపీ నాయకులు మహేశ్, మల్లేశ్, రమేశ్ మంగళవారం పంచాయతీ కార్యదర్శి రవళికి విన్నవించారు. వర్షం పడినప్పుడు అంగన్‌వాడీ కేంద్రంలో నీళ్లు వస్తున్నాయని సరుకులు పెట్టడానికి స్థలం లేదని, పిల్లలకు మూత్రశాలల సౌకర్యం లేదని పేర్కొన్నారు. నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించాలని విన్నవించారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్ విషయంలో బండి సంజయ్‌ను అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో భారత్ సురక్షా సమితి నేతలు కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేటీఆర్ తక్షణమే కేంద్రమంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, నాయకులు పుప్పాల సత్యనారాయణ, నరేందుల శ్రీనివాస్, వేముల పోచమల్లు, గాదాసు భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు

కోరుట్ల: కోరుట్ల నూతన ఎస్సైగా నియమితులైన ఎస్సై సంగమల్ల శ్రీకాంత్‌ను పట్టణానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైని శాలువాతో ఘనంగా సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు సహకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలోబలిజ రాజరెడ్డి, కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, గందం గంగాధర్, సేనాపతి రాజు, ఉయ్యాలశోభన్, కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

41 ఎజెండా అంశాలకు ఆమోదం

- పట్టణ అభివృద్ధే ధ్యేయం
- మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

జగిత్యాల: పట్టణాభివృద్ధే ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో వివిధ రోడ్లలో ఏర్పడిన గుంతలను పూడ్చివేత, చింతకుంట చెరువు వద్ద విద్యుద్దీకరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెరువులో ఉన్న గుర్రపు డెక్క తెప్పలు ఏర్పాటుకు రూ. 28.70 లక్షలు కేటాయించామన్నారు. అలాగే వచ్చే బతుకమ్మ, దసరా, దుర్గామాత ఉత్సవాలకు రూ. 24 లక్షలు, అలాగే మిలాద్ పండుగకు పురస్కరించుకుఏని ముస్లిం గ్రీవ్‌యార్డు లైటింగ్ కోసం రూ. 50 వేలు, క్రిస్మస్ వేడుకల కోసం రూ. 5 లక్షలు కేటాయిస్తూ ఏజెండాలో పొందుపరచామన్నారు. అలాగే పట్టణంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా గోవింద్‌పల్లి, టీఆర్‌నగర్, శంకుల పల్లి, బావుల వద్ద మోటార్స్ కొనుగోలు కోసం రూ. 9.20 లక్షలు, అలాగే 48వ వార్డులో లోకమాత పోచమ్మ ఆలయం వద్ద రూ. 20. 75 లక్షలు, డబుల్ బెడ్రూం వద్ద నీటి సరఫరా కోసం రూ. 48 లక్షలు కేటాయించామని ఆమె పేర్కొన్నారు. మొత్తం 41 ఏజెండా అంశాలను ప్రవేశపెట్టగా ఆమోదం లభించింది. పలు సమస్యలను పరిష్కరించాలని పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని పలువురు కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. సమస్యల పరిష్కారానికి చైర్‌పర్సన్ జ్యోతి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



యూత్ కాంగ్రెస్ అధ్యక్షులతో ప్రభుత్వ విప్

ధర్మపురి: కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిషలు కృషి చేస్తున్న కార్యకర్తలకు భవిష్యత్తులో సముచిత స్థానం దక్కుతుందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కష్ట కాలంలో తన వెంట ఉండి పార్టీ కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తనా కుటుంబ సభ్యుడేనన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం యువకులే కీలక పాత్ర పోషిస్తారన్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులను నియమించారు. ధర్మపురికి అప్పం తిరుపతి, బుగ్గారం రెంటం శ్రీధర్, వెల్గటూర్ పూదరి రమేశ్, పెగడపెల్లి పురుషోత్తమ్ అనిల్, ధర్మారం సోగాల తిరుపతి, ధర్మారం ఆశోధ అజయ్, గొల్లపల్లి మండలానికి పురంశెట్టి గౌతమ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజు, నియోజకవర్గంలోని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

విప్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

సారంగాపూర్: రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీలో సారంగాపూర్ మండలానికి చెందిన రామడుగు రవిని డైరెక్టర్‌గా ఎంపిక చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోండ్ర రాంచంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామడుగు రవి, నాయకులు ఉన్నారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాలరూరల్: నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన సాయికృష్ణకు రూ.12 వేల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలు కార్పొరేట్ ఆస్పత్రిల్లో వైద్యం చేయించుకుంటే ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ నుంచి డబ్బులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత

రాయికల్: పట్టణంలోని ఇంద్ర నగర్ కాలనీ చెందిన పడిగేల సంధ్య భవాని అనే నిరుపేద వధువుకు మంగళవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వధువుకు పుస్తె మట్టెలు పట్టు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు సూర్గి శ్రీనివాస్, సందెల విక్రమ్, రవితేజ, ప్రశాంత్, అన్వేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు

బ్యాగులు అందజేత

మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం మండల లోజ శ్రీనివాస్, కాన పర్తి శ్రీనివాస్,కాటిపెల్లి గంగారెడ్డి,ఉపాధ్యాయుడు గాజెంగి రాజేశం స్కూల్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సామల్ల వేణు,ఆదిరెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.1.64 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. అమృత్ పథకంలో భాగంగా జగిత్యాల నియోజవర్గం పరిధిలో ప్రతి పాఠశాలలో నీటి వసతి కల్పిస్తున్నామని, అమ్మ ఆదర్శ కమిటీ పథకంలో భాగంగా నిధులు కేటాయిస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలను అభివృద్ధి చేసి విద్యార్థులకు మంచి విద్యనందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ నవీన్, డీఈవో జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

రాయికల్: మండలంలోని మూటపెల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థిని గుండ స్వాతి అనే స్టాఫ్‌వేర్ ఉద్యోగం సాధించగా మంగళవారం పాఠశాలకు కంప్యూటర్ ను అందజేశారు. ఈ సందర్భంగా స్వాతిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బెక్కం తిరుపతి, మండ రమేశ్, హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ఢమరుకం వితరణ

రాయికల్: మండలంలోని సింగరావుపేట ద్వాసాంజనేయ స్వామి ఆలయానికి మంగళవారం అల్లీపూర్ మాజీ ఎంపీటీసీ మోర విజయలక్ష్మి వెంకటేశ్ దంపతులు రూ.15 వేల విలువ గల ఢమరుకం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మధు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక తోడ్పాటు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొండగట్టు: పేద కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకే సీఎంఆర్‌ఎఫ్ పథకమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం 213 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు ఎన్ని కష్టాలు వచ్చినా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మేన్నేని రాజ నర్సింగరావు, నాగభూషణం, మల్లికార్జున్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జీవన్ రెడ్డి, చిలువేరి నారాయణ, తహసీల్దార్ రాజమణి పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

మేడిపల్లి: మండలంలోని వెంకట్రావుపేట, దేశాయిపేట, భీమారం గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను భీమారం మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి అజయ్,వరుణ్,కానుగంటిశ్రీనివాస్,గడ్డం జీవన్, కిరణ్,ఎండీచాంద్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు 'చల్మెడ' పరామర్శ

మేడిపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వేములవాడ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పర్యటించారు. జ్వరంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డిని, కాచారంలో కొప్పెర సుమలత, చెన్నమనేని కిషన్‌రావు. వెంకట్రావుపేట గ్రామంలో కానుగంటి క్రిష్ణ, పత్రి అశోక్, కాటిపల్లి మల్లారెడ్డి. రాగోజీపేట గ్రామంలో డాక్టర్ ఆస్మాయిల్, భీమారం మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ పల్లి అర్జున్, పోగుల మల్లేశం, గోవిందారంలో పుల్లూరి దేవయ్య, మొత్కురావుపేటలో పోతర్ల శ్రీనివాస్‌తో పాటు మరికొందరి బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఆయన వెంట చెన్నమనేని అజిత్‌రావు, అంగడి ఆనంద్, రాజోజి చారి, తదితరులు ఉన్నారు.

మహిళల రక్షణకు షీ టీం నిఘా



మహిళలకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

జగిత్యాలక్రైం: జిల్లాలో మహిళల రక్షణ కోసం షీ టీం నిరంతరం పనిచేస్తుందని షీ టీం ఏఎస్సై అలీబేగ్ అన్నారు. మహిళలపై జరిగే నేరాలపై మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బొంబాయి షాపింగ్ మాల్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళల రక్షణ, నేరాలను అరికట్టడమే లక్ష్యంగా షీ టీం పనిచేస్తుందన్నారు. విద్యార్థినులు, మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీ టీం నెంబర్ 87126 70783 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లు రజిత, పూజిత పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దు

మల్లాపూర్: యువత, విద్యార్థులు చిన్నవయసులోనే వ్యసనాలకు బానిసగా మారి చెడుదారి పట్టొద్దని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జగిత్యాల పోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు షీ టీమ్స్, సైబర్‌క్రైమ్స్, డయల్ 100 వంటి పోలీస్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నేడు యువత సామాజిక మాధ్యమాల వలయంలో చిక్కి చెడుమార్గాల వైపు దారి మల్లుతున్నారన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సపోర్ట్ సిస్టమ్, చైల్డ్ హెల్ప్‌లైన్ -1098/112, డయల్-100, సైబర్ క్రైమ్స్ డయల్ -1930లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు రత్నసాగర్, నరేందర్, షీ టీం మెంబర్ మహిళా కానిస్టేబుల్ సౌజన్య, కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయి పెళ్లికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చేయూత

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని లత, ఈశ్వర్ కూతురు దుర్గా భవాని నిరుపేద కుటుంబం కావడంతో సమాచారం తెలుసుకున్న మెట్‌పల్లికి చెందిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మంగళవారం పెళ్లికి కావాల్సిన పుస్తెమెట్టెలు, పెళ్లి కూతురికి పట్టుచీర, 200 మందికి సరిపడా భోజనం సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్, సభ్యులు గణేశ్, అకునూరి శివ, చింటు, రవితేజ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో పార్కింగ్ ఫీజు రద్దు చేయాలి



ఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొండగట్టు: కొండగట్టు ఆలయంలో పార్కింగ్ ద్వారా టికెట్ల రూపంలో భక్తులపై భారం మోపనున్న ఆలోచన రద్దు చేయాలని మల్యాల మండల విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు మంగళవారం కొండగట్టు ఆలయ ఈవో రామకృష్ణరావుకు వినతిపత్రం అందించారు. కొండగట్టు పై జరుగుతున్న అవినీతి,తాగునీటి సమస్య, పారిశుధ్య నిర్వహణ, అసంపూర్తి, ఔట్ సోర్సింగ్ అవకతవకలు ఇతర అనేక సమస్యలున్నాయని, వెంటనే వాటిని పరిష్కరించాలని ఈవోకు విన్నవించారు. పార్కింగ్ ఫీజు రద్దు చేయకపోతే, పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యాగండ్ల లక్ష్మీనారాయణ, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గాజుల మల్లేశం, బుధారపు శంకర్, బొడిగె సురేశ్,పొన్నగంటి గౌతమ్ రాజ్ పాల్గొన్నారు.



జగిత్యాలటౌన్: బల్దియా అధికారుల అలసత్వంతో శివారు కాలనీలు మురికి కూపాలుగా మారుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. జగిత్యాల పట్టణంలోని 9వ వార్డు పరిధిలోని ధరూర్ క్యాంపు అంతర్గాం బైపాస్ రోడ్డుపై చెత్త, వ్యర్థాలు వేస్తుండటంతో వాహనదారులు, స్థానికులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంప్రదించాల్సిన అధికారి సమ్మయ్య, బల్దియా కమిషనర్,జగిత్యాల
ఫోన్ నంబర్, 9849905877

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

కవితకు బెయిల్‌పై సంబరాలు



జగిత్యాలలో స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు



కోరుట్లలో టపాసులు కాల్చుతున్న నాయకులు

జగిత్యాలటౌన్/కోరుట్ల రూరల్/మెట్‌పల్లి/మెట్‌పల్లి రూరల్/రాయికల్/కథలాపూర్/మల్లాపూర్/సారంగాపూర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరైన బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. టపాకాయలు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.ఈడీ, సీబీఐ లాంటి సంస్థలు ఎంత ఒత్తిడి తెచ్చినా సుప్రీం కోర్టులో బెయిల్ రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చెరువులు, కుంటలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మల్లాపూర్: చెరువులు, కుంటలను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఫిషర్మెన్ కమిటీ మండల అధ్యక్షుడు రొద్ద రాజు కోరారు.మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మత్స్యకారులతో కలిసి తహసీల్దార్ వీర్ సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలకు సంబంధించిన భూములను అక్రమార్కులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంతో పాటు విక్రయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండలాలు, గ్రామాలకు 'హైడ్రా' పరిధిని పెంచి వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు న్యావనంది నడ్పి సర్పయ్య పాల్గొన్నారు.

- **అడవిపందుల దాడిలో మొక్కజొన్న ధ్వంసం**

మల్లాపూర్: మండల కేంద్రం శివారులో మంగళవారం అడవిపందుల దాడిలో మొక్కజొన్న పంట పూర్తిగా ధ్వంసమైంది. ఈ సందర్భంగా బాధిత రైతు అనంతరెడ్డి మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి అప్పుతెచ్చి పెట్టుబడితో 4 ఎకరాల్లో మొక్కజొన్న, పసుపు పంటలను సాగు చేశానని ఆవేదన వ్యక్తం చేశాడు. మరో నెలలో పంట చేతికి వచ్చే క్రమంలో అడవిపందులు పంటపై దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేశాయని విలపించాడు. బాధిత రైతును ప్రభుత్వం సంబంధిత అధికారులు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

- **ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన**

ధర్మపురి: పట్టణంలోని ఆంగ్లోవేదిక్ పాఠశాలలో మంగళవారం ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల నియమావళి, ఎన్నికల్లో పోటీచేసే నామినేషన్లు, విత్‌డ్రాలు, ఈవీఎంలు మిషన్లు, వీవీ ప్యాట్‌లు, బ్యాలెట్ బాక్స్, ఓటు వేసే విధానం తదితర వాటిపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్ దినేష్, ప్రధానోపాధ్యాయులు తోట శంకర్, యాజమాన్యం తదితరులున్నారు.

- **ఇటిక్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా బి.మోహన్**

రాయికల్: మండలంలోని ఇటిక్యాల ప్రభుత్వ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా భీమనాతి మోహన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర విద్యాభివృద్ధికి కృషి చేస్తానని, ఉన్నత ఫలితాల సాధన లక్ష్యంగా ఉపాధ్యాయులతో కలిసి పని చేస్తానని పేర్కొన్నారు.

- **బీఆర్‌ఎస్ పట్టణ కార్యవర్గం**

రాయికల్: రాయికల్ పట్టణ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షులుగా వాసం రాజేందర్,తిరుణగరి రామచంద్రం, పటేల్‌శివ ,ప్రధాన కార్యదర్శిగా వల్లకొండ మహేష్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా నెరేళ్ల వినోద్, లింగాపెల్లి సుభాశ్, కోశాధికారిగా నీలి రమేశ్, అధికార ప్రతినిధిగా మోసిన్‌బాబాలను నియమించినట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్ మంగళవారం తెలిపారు.

- **మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం**

కోరుట్ల: కోరుట్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నూతనంగా నియామకమైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీరాముల అమరేందర్‌ను మున్నూరు కాపు సంఘ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, నాయకులు బండారి శంకర్, ఎలిశెట్టి గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

- **30 నుంచి ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడలు**

కథలాపూర్: మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఈనెల 30 నుంచి (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్)ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఆనందరావు, పీడీ రవీందర్ మంగళవారం తెలిపారు. 30న బాలికలకు అండర్-14, 17 విభాగాల్లో వేర్వేరుగా ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 31న బాలురకు అండర్ -14, 17 విభాగాల్లో వేర్వేరుగా ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలుంటాయని పేర్కొన్నారు. వచ్చే నెల 2న మండల స్థాయి ఫైనల్ సెలక్షన్స్ ఉంటాయన్నారు. వచ్చే నెల 3న బాల బాలికలకు వేర్వేరుగా అథ్లెటిక్స్ పోటీలుంటాయన్నారు. ఈ క్రీడలకు హాజరయ్యే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డులు తీసుకుని రావాలన్నారు. విద్యార్థులు అధికసంఖ్యలో హాజరయ్యేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చొరవ చూపాలని నిర్వాహకులు కోరారు.

- **3 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు**

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వచ్చే నెల 3 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు తెలిపారు. అండర్ - 14, 17 బాలికల కబడ్డీ , ఖోఖో,వాలీబాల్ పోటీలు సెప్టెంబర్ 4న, అండర్-14, 17 బాలుర కబడ్డీ, వాలీబాల్ పోటీలు సెప్టెంబర్ 5న, అండర్ -14, 17 బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్- 14 బాలికలు, 51 నుంచి 48 కిలోల బరువు, అండర్ -17 బాలబాలికలు 55 కిలోల లోపు అర్హులని, వివరాలకు రాజు పీడీ సెల్ నంబర్ 9441183035, 9494992767లో సంప్రదించాలని పేర్కొన్నారు.